నియోజకవర్గానికి కిషన్‌రెడ్డి ఏం చేశారో చెప్పాలి?

బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న పద్మారావుగౌడ్, ఎమ్మెల్యే తలసాని

సనత్‌నగర్: కేంద్ర మంత్రిగా సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు కిషన్‌రెడ్డి ఏం చేశారో చెప్పాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్ ప్రశ్నించారు. మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్, సనత్‌నగర్, సికింద్రాబాద్ నియోజకవర్గాల ఎన్నికల ఇన్‌చార్జిలు వెంకట్‌రెడ్డి, మేడే రాజీవ్‌సాగర్, సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డితో కలిసి సనత్‌నగర్‌లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డీఎస్‌ఎం కాలనీ నుంచి అశోక్‌కాలనీ, వెల్ఫేర్ గ్రౌండ్, శ్యామలకుంట, ఉదయ్‌నగర్ తదితర ప్రాంతాల మీదుగా 60 ఫీట్ల రోడ్డు వరకు ప్రచారం నిర్వహించారు. సనత్‌నగర్ బస్టాండ్ వద్ద పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ..ప్రజలు అభివృద్ధి కోరుకుంటున్నారని, అందుకే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి బ్రహ్మరథం పట్టారని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కిషన్‌రెడ్డి ఏనాడూ నియోజకవర్గ అభివృద్ధి పట్టించుకోలేదని విమర్శించారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ ప్రచారంలో కొలను బాల్‌రెడ్డి, హన్మంతరావు, ఖలీల్‌బేగ్, సురేష్‌గౌడ్, కరీంలాలా, ఫాజిల్, నోమాన్, శేఖర్, రాజేష్‌ముదిరాజ్, అశోక్‌యాదవ్, శ్రీహరి, భూపాల్‌రెడ్డి, ఆకుల రాజు, కుమార్, వనం శ్రీనివాస్, శ్యాంసన్, జమీర్, పుష్పలత, సరితగౌడ్ పాల్గొన్నారు.

మోదీ హయాంలో విధ్వంసకర పాలన


మోదీ పదేళ్ల పాలనపై కరపత్రాన్ని విడుదల చేస్తున్న దృశ్యం

క్రిష్టియన్ డెమోక్రటిక్ మూవ్‌మెంట్

రాంగోపాల్‌పేట్: గత పదేళ్లుగా దేశంలో ఎన్‌డీఏ నేతృత్వంలోని మోదీ ప్రభుత్వం దేశంలో విధ్వంసకర పాలన కొనసాగిస్తుందని క్రిష్టియన్ డెమోక్రటిక్ మూవ్‌మెంట్ (క్రైస్తవ ప్రజాస్వామ్య ఉద్యమం) సంస్థ ఆరోపించింది. సోమవారం రెజిమెంటల్‌బజార్‌లోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మెల్కెసెదక్, ఉపాధ్యక్షులు టీసీ కిష్టఫర్ ఎస్సీ, ఎస్టీ, బీసీ ముస్లిం ఫ్రంట్ చైర్మన్ సనావుల్లా ఖాన్, మైనార్టీ జేఏసీ కో కన్వీనర్ తన్వీర్ మాట్లాడారు. దేశాన్ని మతం ప్రాతిపదికన విడగొట్టి ప్రజల మధ్య విబేధాలను తీసుకువస్తున్నారని, అభివృద్ధిని విస్మరించి గత ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన అనేక గొప్పగొప్ప ప్రభుత్వ రంగ సంస్థలను తమ వాళ్లకు అప్పనంగా అప్పగిస్తున్నారని విమర్శించారు. కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా ప్రజాస్వామ్య, సెక్యులర్ భావాలను తుంగలో తొక్కి రాజ్యాంగం మూల స్వరూపాన్ని పూర్తిగా మార్చి కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మణిపూర్‌లో మత ఘర్షణలో వేల మంది చనిపోయారని, దేశానికి వెన్నెముక అయిన రైతులను ఆదుకోవాల్సింది పోయి వారి ఉద్యమాలను అణచివేసేందుకు యత్నించిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలతో దేశంలోని ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనార్టీ వర్గాలకు తీరని అన్యాయం జరుగుతుందని అందుకే రాబోయే ఎన్నికల్లో ప్రజాస్వామిక వాదులు, మేధావులు బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఇండియా కూటమికి మద్దతు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు డాక్టర్ అబ్రహం, జాన్ అరుణ్‌కుమార్, హంసవేణి, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత గాంధీ మెడికల్ కాలేజీ


విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న గాంధీ పాలనాధికారులు

గాంధీఆస్పత్రి : కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఆధ్వర్యంలో హన్మకొండ కాకతీయ మెడికల్ కాలేజీ మైదానంలో జరిగిన ఇంటర్ కాలేజియేట్ క్రికెట్ టోర్నమెంట్‌లో సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ జట్టు విజేతగా నిలిచింది. ఈ నెల 20 నుంచి 28వ తేదీ వరకు జరిగిన క్రికెట్ టోర్నమెంట్‌లో మొత్తం 63 మెడికల్ కాలేజీ జట్లు పాల్గొనగా ఫైనల్ మ్యాచ్‌లో కాకతీయ మెడికల్ కాలేజీ జట్టుపై గాంధీ మెడికల్ కాలేజీ జట్టు విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుంది. సోమవారం గాంధీ మెడికల్ కాలేజీ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో గాంధీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రమేష్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రవీందర్ విజేతలకు ట్రోఫీలు అందించి అభినందించారు. విజేత జట్టు సభ్యులు అరుణ్‌రాథోడ్, కేతన్, కుషాల్, అరుణ్, జయరామ్, దినేష్, మణిదీప్, కార్తీక్‌మిశ్రా, లెనిన్, వర్ధన్‌రెడ్డి, వర్షిత్, వసంత్, సాత్విక్, దేవేందర్, ఉమాప్రసాద్, ఫిజికల్ డైరెక్టర్ (పీడీ) వేణు పాల్గొన్నారు.

తక్షశిల పాఠశాలలో కార్మిక దినోత్సవం


కార్మికులకు నగదు అందజేస్తున్న విద్యార్థులు

లాలాపేట: కార్మిక దినోత్సవం (మే 1)పురస్కరించుకుని తక్షశిల పబ్లిక్ స్కూల్లో అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని 'ఛోటిసి–ఆశ' పేరుతో సోమవారం వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల నుంచి పోగు చేసిన మొత్తాన్ని కవర్లలో పెట్టి స్కూల్‌లోని కార్మికుల(సబ్‌స్టాఫ్)కు అందజేశారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ తను ప్రీత్‌కౌర్ మేడే విశిష్టతను వివరించారు. సమాజ నిర్మాణంలో కార్మికుల సేవలను కొనియాడారు.

కరపత్రం అందుకో.. హస్తం గుర్తుంచుకో!



కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో భాగంగా సోమవారం కాంగ్రెస్ అభ్యర్థి శ్రీ గణేష్ మూడవ వార్డు పరిధిలోని మడ్‌ఫోర్ట్ డబుల్ బెడ్రూమ్ ఇళ్ల సముదాయం, అంబేడ్కర్‌నగర్, కార్ఖాన బస్తీల్లో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి, చేయనున్న పనులకు సంబంధించి ముద్రించిన కరపత్రాలను ఓటర్లకు అందజేసి తన గెలుపునకు సహకరించాలని కోరారు.
–రసూల్‌పురా

మీ ఇంటికి వచ్చానక్కా.. నాకు ఓటేయాలి పక్కా!

రసూల్‌పురాలోని కట్టమైసమ్మ బస్తీ, సిల్వర్‌కాంపౌండ్ డబుల్ బెడ్రూమ్ ఇళ్ల సముదాయం,105 గల్లీ, సీబీఎస్ నగర్ బస్తీల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి నివేదిత ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం చేశారు. గతంలో తన తండ్రి నియోజకవర్గాల వాసుల కోసం ఎంతో చేశారని, తనను గెలిపిస్తే తన తండ్రి బాటలో నడుస్తూ కంటోన్మెంట్ అభివృద్ధికి పాటు పడుతానని హామీ ఇచ్చారు.
–రసూల్‌పురా



సమస్యాత్మక బూత్‌లపై ప్రత్యేక నిఘా

- సనత్‌నగర్‌లో 39 బూత్‌ల గుర్తింపు
- పోలింగ్ సామగ్రి పంపిణీకి 23 రూట్లు
- ప్రశాంత ఓటింగ్‌కు పోలీసు కవాతులు
- నిరంతరం అందుబాటులో క్విక్ రియాక్షన్ టీమ్



సనత్‌నగర్: మే 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సనత్‌నగర్ నియోజకవర్గంలో 39 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లను అధికారులు గుర్తించారు. ఆయా పోలింగ్ బూత్‌లు 12 భవనాల్లో (లొకేషన్స్) ఉన్నాయి. ఈ మేరకు ఎన్నికల సనత్‌నగర్ నియోజకవర్గంలో 97 భవనాల్లో మొత్తం 229 పోలింగ్ బూత్‌లు ఉండగా వాటిలో క్లిష్ట, అతిక్లిష్టమైనవిగా గుర్తించి 39 పోలింగ్ బూత్‌ల్లో ఎన్నికల నాటికి భద్రతను కట్టుదిట్టం చేసేందుకు ప్రణాళిక రూపొందించారు. ఈ మేరకు నోడల్ అధికారి పర్యవేక్షణలో అతి క్లిష్టమైన బూత్‌లు కలిగిన భవనాల వద్ద ఒక సబ్ ఇన్‌స్పెక్టర్, ఆరు కేంద్ర సాయుధ బలగాల సిబ్బందిని నియమించేందుకు నిర్ణయం తీసుకున్నారు. క్లిష్టమైన పోలింగ్ బూత్‌ల వద్ద హెడ్ కానిస్టేబుల్, మరో కానిస్టేబుల్, ఇంకో హోంగార్డు ప్రత్యేకంగా విధులు నిర్వహించనున్నారు. వీరితో పాటు స్థానిక పోలీస్‌స్టేషన్లకు చెందిన సిబ్బంది, ప్రత్యేక భద్రతా సిబ్బంది విధుల్లో ఉంటారు.

ఇవే బూత్‌లు

మోండా మార్కెట్ ఇస్లామియా బాలుర హైస్కూల్ భవనం, పద్మారావునగర్ సర్దార్ పటేల్ కాలేజ్, న్యూబోయిగూడ గొల్లకొమురయ్య కాలనీ కమ్యూనిటీ హాల్, న్యూబోయిగూడలోని సెయింట్ ఫిలోమియా హైస్కూల్, నల్లగుట్టలోని జియా–ఉల్–ఇస్లాం హై స్కూల్, ఓల్డ్ నల్లగుట్టలోని ప్రభుత్వ బాలికల హైస్కూల్, మహంకాళి స్ట్రీట్‌లోని ఉజ్జయినీ మహంకాళి టెంపుల్ సమీపంలోని ఆదయ్య మెమోరియల్ హైస్కూల్, బీకేగూడ రవీంద్రనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్, బాపునగర్ కమ్యూనిటీ హాల్, బేగంపేట పాటిగడ్డ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాల, బ్రాహ్మణవాడీ గీతాంజలి స్కూల్, సనత్‌నగర్ అశోక్‌కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాల్లో ఉన్న పోలింగ్ స్టేషన్లను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించారు. ఆయా పోలింగ్ స్టేషన్లు బేగంపేట (2 పోలింగ్ కేంద్రాలు), గాంధీనగర్ (2), మహంకాళి పీఎస్ (1), మార్కెట్ పీఎస్ (1), చిలకలగూడ (1), రాంగోపాల్‌పేట్ (2), సనత్‌నగర్ (1), ఎస్‌ఆర్‌నగర్ (2) పోలీస్‌స్టేషన్లలో విస్తరించి ఉన్నాయి.

తరచూ పోలీసు కవాతులు..

ప్రధానంగా సమస్యాత్మక పోలింగ్ బూత్‌లు కలిగిన ప్రాంతాలపై పోలీసులు దృష్టిసారించారు. ఈ మేరకు నిర్భయంగా ఓటు వేసేలా కవాతుల ద్వారా పోలీసులు ప్రజల్లో ఆత్మస్థైర్యాన్ని నింపే ప్రయత్నం చేస్తున్నారు. బేగంపేట, సనత్‌నగర్, రాంగోపాల్‌పేట, మహంకాళి తదితర పోలీస్‌స్టేషన్ల పరిధుల్లో ఫ్లాగ్‌మార్చ్‌ల నిర్వహణ చేపట్టి ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పేలా చర్యలు తీసుకుంటున్నారు.


బేగంపేటలో పోలీసుల కవాతు

23 రెవెన్యూ రూట్లుగా విభజన..

సనత్‌నగర్ నియోజకవర్గానికి సంబంధించి డీఆర్‌సీ (డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్)గా ఉస్మానియా యూనివర్శిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలను ఎంపిక చేసిన విషయం విదితమే. ఇప్పటికే ఇక్కడి స్ట్రాంగ్ రూమ్‌లో ఈవీఎంలు, వీవీ ప్యాట్లను సాయుధ బలగాల భద్రత నడుమ భద్రపరిచారు. పోలింగ్‌కు ఒక రోజు ముందు అంటే మే 12న ఇక్కడి నుంచే నియోజకవర్గంలోని 229 పోలింగ్ స్టేషన్ల సిబ్బందికి పంపిణీ చేయనున్నారు. అందుకోసం నియోజకవర్గ పరిధిని 23 రెవెన్యూ రూట్లుగా విభజించారు. ప్రతి రెవెన్యూ రూట్‌లో ఒక సెక్టార్ అధికారి పర్యవేక్షణలో పోలీసు భద్రత ఉంటుంది. అదేవిధంగా నియోజకవర్గంలో చేరే ప్రాంతాల్లో మూడు ప్రత్యేక చెక్ పోస్టులను ఏర్పాటు చేయనున్నారు.

ఎన్నికల ప్రక్రియ సాఫీగా జరిగేలా స్థానిక పోలీసులు, కేంద్ర సాయుధ బలగాలతో పాటు క్విక్ రియాక్షన్ టీమ్ అందుబాటులో ఉంటుంది. స్థానికంగా ఎలాంటి విపత్కర, అవాంఛనీయ సంఘటన ఎదురైనా తక్షణం స్పందించి చర్యలు తీసుకుంటుంది. సదరు టీమ్ 24 గంటల పాటు అందుబాటులో ఉంటుంది.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.19, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 35, పచ్చిమిర్చి 50, బజ్జీమిర్చి 28, క్యాప్సికమ్ 60, పచ్చకాకర 32, పందిరి బీర 35, క్యాబేజీ 15, క్యారెట్ 31, దొండ 23, గుండుబీన్స్ 80, గింజ చిక్కుడు 50, గోకరకాయ 28, కీర 23, దోసకాయ 16, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 19, ఆలుగడ్డ 33, చామగడ్డ 35, మొరంగడ్డ 23, కందగడ్డ 70, సొరకాయ 9, పొట్లకాయ 13, అరటికాయ 9, మునగకాయ 3–4, ముల్లంగి 4–5. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

అందరూ బాధ్యతగా ఓటేయాలి



సనత్‌నగర్: మే 13న జరగనున్న సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలంటూ మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డికి సనత్‌నగర్ నియోజకవర్గం 37వ పోలింగ్ బూత్ బీఎల్‌ఓ ఓటరు స్లిప్పు అందజేశారు. అనంతరం 'ఐయామ్ ఏ ప్రౌడ్ ఓటరు' స్టిక్కర్‌ను భవనానికి అతికించారు. పోలింగ్ శాతాన్ని పెంచే దిశగా ఇంటింటికి ఓటరు స్లిప్పుల పంపిణీ ముమ్మరంగా కొనసాగుతుందని, ప్రతిఒక్కరూ బాధ్యతగా ఓటు హక్కు వినియోగించుకోవాలని బీఎల్‌ఓలు సూచిస్తున్నారు.

ఇంటి నుంచి పారిపోయిన మైనర్లు

హోమ్‌కు తరలింపు

అడ్డగుట్ట: ఇంటి నుంచి పారిపోయి రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న నలుగురు మైనర్లను రైల్వే పోలీసులు చేరదీశారు. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. ముషీరాబాద్‌కు చెందిన అబ్దుల్ రఫీ(17), ఫైసాలుర్ రెహ్మాన్(14), అబ్దుల్లా(13), అబ్దుల్ రెహమాన్(16) తమ తమ ఇళ్లలో నుంచి పారిపోయి వచ్చి ఈ నెల 28న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో సంచరిస్తున్నారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురిని రైల్వే, జీఆర్పీ పోలీసులు విచారించగా, ఇంటి నుంచి పారిపోయి వచ్చినట్లు చెప్పారు. అనంతరం నలుగురిని చేరదీసి కాచిగూడలోని హోమ్‌కు తరలించినట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

రాంగోపాల్‌పేట్: అనుమానాస్పద స్థితిలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. ఎస్సై సుబ్రహ్మణ్యం వివరాల ప్రకారం.. ఎంజీ రోడ్డులోని గాంధీ విగ్రహం వద్ద ఫుట్‌పాత్‌పై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతుడికి వయస్సు 40 ఏళ్లు ఉంటుందని నలుపురంగు ప్యాంటు, ఆకు పచ్చరంగు టీ షర్ట్ ధరించి ఉన్నాడని ఎడమ కాలు, చేతిపై గాయాలు ఉండటంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే 8712661253, 8712660240 నంబర్లలో సంప్రదించాలన్నారు.

కాంగ్రెస్ పూర్వవైభవానికి కృషి చేయాలి


చిలకలగూడలో ప్రచారం చేస్తున్న నాయకులు

చిలకలగూడ : సికింద్రాబాద్‌లో కాంగ్రెస్‌కు పూర్వవైభవం తెచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కృషి చేయాలని కాంగ్రెస్ నాయకుడు ఆదం సంతోష్ కుమార్ పిలుపునిచ్చారు. సీతాఫల్‌మండి డివిజన్ చిలకలగూడ, మైలార్‌గడ్డ, నామాలగుండు, శ్రీనివాసనగర్, షాబాద్‌గూడ, మహ్మద్‌గూడ, ఉప్పరిబస్తీ, బ్రాహ్మణబస్తీ తదితర ప్రాంతాల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించి హస్తం గుర్తుకు ఓటేసి కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణలో అత్యధిక పార్లమెంట్ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు.

'బీజేపీ గెలుపు ఖాయం'


ప్రచారంలో పాల్గొన్న బీజేపీ శ్రేణులు

చిలకలగూడ : సికింద్రాబాద్‌లో బీజేపీ అభ్యర్థి కిషన్ రెడ్డి అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తారని సికింద్రబాద్ మహంకాళి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, ఉపాధ్యక్షుడు రాచమల్ల కృష్ణమూర్తి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి ఆకారం రమేష్ ధీమా వ్యక్తం చేశారు. సీతాఫల్‌మండి డివిజన్ చిలకలగూడ, భవానీనగర్, కిందిబస్తీ మైలార్‌గడ్డ, నామాలగుండు తదితర ప్రాంతాల్లో సోమవారం ఇంటింటికి తిరిగి ఓటర్ స్లిప్పులు అందించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు క్షేత్రస్థాయిలో పనిచేసి కిషన్‌రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కిషన్ రెడ్డి గెలుపు ఖాయమని, మెజార్టీ మరింత పెంచుకునేందుకు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు.

కిషన్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం


ఇంటింటి ప్రచారంలో బీజేపీ నాయకులు

సనత్‌నగర్: సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డికి మద్దతుగా ఆ పార్టీ నేతలు సోమవారం సనత్‌నగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బూత్ కో–ఆర్డినేటర్ కన్నూరి చంద్రకుమార్, బూత్ అధ్యక్షులు అమర్నాథ్, సభ్యులు రమేష్‌తో కలిసి సనత్‌నగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కన్నూరి క్రాంతికుమార్ ఇంటింటికి తిరుగుతూ కమలం కలమం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కేంద్రంలో నరేంద్రమోదీ నాయకత్వంలో కిషన్‌రెడ్డి సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధితో పాటు రాష్ట్రంలో ఎన్నో ప్రాజెక్టులను తీసుకువచ్చారన్నారు. సంక్షేమ ఫలాలు సక్రమంగా ప్రజలకు అందాలంటే మరోసారి కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వమే రావాలన్నారు.

బీజేపీకి మద్దతిస్తాం


మాట్లాడుతున్న నర్సింగ్ రావు, వంశతిలక్

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో తమ పార్టీ బీజేపీకి మద్దతు ఇస్తోందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జే. నర్సింగ్ రావు ప్రకటించారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం సూచనలతో తాను కంటోన్మెంట్ అసెంబ్లీ ఎన్నికల బరినుంచి తప్పుకుంటూ నామినేషన్ ఉపసంహరించుకున్నానని ప్రకటించారు. బీజేపీ అభ్యర్థి వంశ తిలక్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీ, టీడీపీ మధ్య పొత్తు నేపథ్యంలో తెలంగాణలోనూ బీజేపీ అభ్యర్థులకు పార్టీ మద్దతు కొనసాగుతుందన్నారు. మధుసూదన్, శ్రీనివాస్, అనురాధ పాల్గొన్నారు.

పద్మారావుకు మద్దతుగా కార్పొరేటర్ల ప్రచారం


పార్టీ శ్రేణులతో కలసి ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ హేమ

చిలకలగూడ : పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుని సికింద్రాబాద్ నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగురవేస్తామని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ అన్నారు. సీతాఫల్‌మండి, జోషికాంపౌండ్, దత్తాత్రేయ టెంపుల్, మేడిబావి తదితర ప్రాంతాల్లో సోమవారం పద్మారావుకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అమలు కాని హామీలతో ప్రజలను మభ్యపెట్టి గద్దె ఎక్కిన కాంగ్రెస్ ప్రభుత్వంలో మంచినీళ్లు, కరెంట్ సమస్యలు ప్రారంభం అయ్యాయన్నారు. కారు గుర్తుకు ఓటేసి మరోమారు పద్మారావును గెలిపించుకునేందుకు స్థానిక ప్రజలు ఎంతో ఉత్సాహంగా ఉన్నారని, సికింద్రాబాద్‌లో బీఆర్‌ఎస్ గెలుపు ఖాయమన్నారు.

అడ్డగుట్టలో..


అడ్డగుట్టలో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి

అడ్డగుట్ట: సికింద్రాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌కు మద్దతుగా స్థానిక కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మి సోమవారం ఎన్నికల ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే ప్రజా నాయకుడు పజ్జన్నను భారీ మెజారిటీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత సికింద్రాబాద్ ప్రజలపై ఉందన్నారు. సొంత ప్రయోజనాల కోసం తరచూ పార్టీలు మారే నాయకుడు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి అని, గతంలో రెండు మార్లు ఎంపీగా గెలిచి తనకు ఓట్లేసి గెలిపించిన ప్రజలను పట్టించుకోకుండా ప్రజా సమస్యలను గాలికొదిలేసిన వ్యక్తి బీజేపీ అభ్యర్థి అని విమర్శించారు. ఎప్పుడు ప్రజా సమస్యల పరిష్కారానికై కృషి చేసే బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌ను గెలిపించాలని కోరారు. ప్రచారంలో శిల్పా రామేశ్వర్, లింగాని శ్రీను, శ్రీనివాస్‌గౌడ్, వసంత, దాసరి శ్రీనివాస్, రాజు, అమర్, మహ్మద్, గౌస్, మల్లేష్, రామప్ప, అయోధ్య, విజయ, రమా పాల్గొన్నారు.

బౌద్ధనగర్ డివిజన్‌లో..


ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ శైలజ

బౌద్ధనగర్: బీఆర్‌ఎస్ సికింద్రాబాద్ లోక్‌సభ అభ్యర్థి పద్మారావుగౌడ్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని కార్పొరేటర్ కంది శైలజ అన్నారు. సోమవారం డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఆమె ఎన్నికల ప్రచారం చేస్తూ మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపిస్తాయన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేసిన పద్మారావుగౌడ్ కూడా భారీ మెజార్టీతో విజయం సాధించనున్నారని ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రచారంలో రాజేష్, మానస, బళ్ల గీత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో ప్రధాని దిష్టిబొమ్మ దహనం


దిష్టిబొమ్మ దహనం చేస్తున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో దేశ ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను విద్యార్థులు దహనం చేశారు. రిజర్వేషన్లను రద్దు చేస్తామని అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు నిరసన తెలిపారు. సోమవారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మోదీ దిష్టిబొమ్మను దహనం చేసిన అనంతరం మాట్లాడారు. ఆది నుంచి రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్‌తో బీజేపీ జతకట్టి రాజ్యాంగాన్ని కూడా మార్చాలని ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో విద్యార్థి నేతలు వెంకట్‌నాయక్, వలిగొండ నరసింహ, ఈశ్వర్, అజయ్, రఫీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


పూజల్లో పాల్గొన్న భక్తులు

సనత్‌నగర్: బేగంపేట ప్రకాష్‌నగర్‌లోని భూలక్ష్మీ దేవాలయ అష్టమ వార్షికోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ నిర్మాణ దాత విశాల్‌సూదం ఆధ్వర్యంలో సోమవారం విశేష పూజాది కార్యక్రమాలు జరిగాయి. మండపారాధన అష్టోత్తర శత (108) కలశ పూజ అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భూలక్ష్మీ అమ్మవారికి 108 కలశాలతో వివిధ పరిమళ సుగంధ ద్రవ్య, ఫల పంచామృత హరిద్రోక, కుంకుమ, పుష్ప సహిత అభిషేక మహోత్సవాలను నిర్వహించారు. అంతక ముందు ఉదయం సుప్రభాతసేవ, మహాహారతి, మహాగణపతి, గౌరీదేవీ స్వస్తి పుణ్యాహవాచనం జరిగాయి.